క్లుప్తంగా

వివాదాస్పద స్థలం పరిశీలన



వివాదాస్పద స్థలాన్ని పరిశీలిస్తున్న డివిజినల్ సర్వేయర్ శ్రీనివాసరావు

మెరకముడిదాం: మండలంలోని బుధరాయవలస పోలీస్ స్టేషన్ వెనుక భాగంలో ఉన్న స్థలం విషయంలో పోలీసులు, గ్రామస్తులకు మధ్య కొన్ని నెలలుగా వివాదం నడుస్తోంది. ఈస్థలాన్ని పోలీసులు, గ్రామపెద్దలతో కలిసి డివిజినల్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వే పి.శ్రీనివాసరావు సోమవారం పరిశీలించారు. స్థలం కొలతలు తీసుకొని రికార్డులను తనిఖీలు చేశారు. నివేదికను ఉన్నతాధికారులకు అందజేసి, వారి ఆదేశాల మేరకు తదుపరి చర్య లు తీసుకుంటామని డివిజినల్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వే శ్రీనివాసరావు తెలిపారు. స్థానిక సర్వేయర్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

'గడప గడప' నిధులతో సీసీ రోడ్లు, కాలువల నిర్మాణం



సీసీ కాలువ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఎంపీటీసీ అప్పలనాయుడు

దత్తిరాజేరు: మండలంలోని కోమటిపల్లి గ్రామంలో 'గడప గడపకు మన ప్రభుత్వం' నిధులు రూ.11 లక్షలతో సీసీరోడ్లు, కాలువలు నిర్మిస్తున్నట్లు ఎంపీటీసీ మంత్రి అప్పలనాయుడు తెలిపారు. ఈ నిధులతో గ్రామంలోని కర్ణాల వీధిలో కాలువల నిర్మాణ పనులను సోమవారం ప్రారంభించారు. కాలువల పనులు పూర్తయిన తర్వాత సీసీ రోడ్డు నిర్మిస్తామని చెప్పారు. అనంతరం ఎస్సీ కాలనీలో రోడ్డు,కాలువలు నిర్మించనున్నట్లు పేర్కొన్నారు.

జెడ్పీ చైర్మన్‌కు శుభాకాంక్షలు



జెడ్పీ చైర్మన్ శ్రీనివాసరావును సత్కరిస్తున్న మండల ప్రజాప్రతినిధులు

చీపురుపల్లి: జిల్లా పరిషత్ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించి రెండేళ్లు పూర్తయిన సందర్భంగా మజ్జి శ్రీనివాసరావుకు జెడ్పీటీసీ వలిరెడ్డి శిరీష, చీపురుపల్లి మేజర్ పంచాయతీ సర్పంచ్ మంగ ళగిరి సుధారాణి, కాపు కార్పొరేషన్ డైరెక్టర్ బెవర ఉమాకుమారి శుభాకాంక్షలు తెలిపారు. స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయానికి సోమవారం సాయంత్రం వచ్చిన జెడ్పీ చైర్మన్‌ను నాయ కులతో కలిసి సత్కరించారు. గత రెండేళ్లలో జెడ్పీ చైర్మన్‌గా జిల్లాలో అనేక అభివృద్ధి కార్యక్రమా లు చేపట్టారని, భవిష్యత్‌లో జిల్లాను మరింత అభివృద్ధి పథంలో నడిపించాలని కోరారు. నాయకులు వలిరెడ్డి శ్రీనివాసనాయుడు, బాణాన శ్రీనివాసరావు, చందక గురునాయుడు, బాణాన రమణ, సువ్వాడ అప్పలనాయుడు, రఘుమండ త్రినాథ్, రేవల్ల సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

అక్టోబర్ 3 నుంచి గ్రామసభలు

శృంగవరపుకోట: గ్రామాల అభివృద్ధి ప్రణాళికలపై మండలంలో అక్టోబర్ 3వ తేదీ నుంచి 7వ తేదీ వరకు గ్రామసభలు నిర్వహించనున్నామని ఎంపీడీఓ శేషుబాబు తెలిపారు. సంబంధిత షెడ్యూల్‌ను సోమవారం ఆయన విడుదల చేశారు. అక్టోబర్ 3న ఆలుగుబిల్లి, తిమిడి, వినాయకపల్లి, మామిడిపల్లి, కృష్ణాపురం, పెదఖండేపల్లి, కొట్టాం, శివరామరాజుపేట గ్రామాల్లో, 4న వసి, రేవళ్లపాలెం, కొత్తూరు, చామలాపల్లి, 5న దారపర్తి, ముషిడిపల్లి, ఎస్.జి.పేట, వేములాపల్లి, వెంకటరమణపేట, వీరనా రాయణం, ఎస్.కోట తలారి గ్రామాల్లో, 6న ధర్మవరం, కిల్తంపాలెం, గోపాలపల్లి, 7న ఎస్.కోట, సీతారాం పురం, పోతనాపల్లి, మూలబొడ్డవర గ్రామాల్లో గ్రామ సభలు నిర్వ హిస్తున్నట్లు చెప్పారు. గ్రామాల అభివృద్ధి, భవిష్యత్ కార్యాచరణ నిమిత్తం గ్రామ స ర్పంచ్, గ్రామస్థాయి అధికారుల నేతృత్వంలో మండలస్థాయి అధికారుల పర్యవేక్షణలో నిర్వహించే ఈ గ్రామసభల్లో ప్రజలు భాగస్వాములు కావాలని కోరారు.

జెడ్పీటీసీకి సన్మానం



జెడ్పీటీసీ సూర్యప్రకాశరావును సన్మానిస్తున్న ఎంపీపీ చలంనాయుడు,అధికారులు

బొండపల్లి: జెడ్పీటీసీగా రెండేళ్ల పదవీ కాలం పూర్తి చేసుకున్న రాపాక సూర్యప్రకాశరావును స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ చల్లా చలంనాయుడు అధ్యక్షతన మండల అధికారులు సోమవారం సన్మానించారు. జెడ్పీటీసీతో కేక్ కట్ చేయించారు. ఈసందర్భంగా జెడ్పీటీసీ మాట్లాడుతూ ప్రజాప్రతినిధులు, అధికారుల సహాయ సహకారాలతో మండలాభివృద్ధికి తనవంతు కృషి చేస్తున్నానని చెప్పారు. ఎంపీడీఓ వై.వి.రాజేంద్రప్రసాద్, ఏఒ డి.వెంకటరమణ,సీనియర్ సహాయకులు ఎస్.శ్రీనివాసరావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

అవినీతి రహిత, సంక్షేమ పాలన



మహిళలకు పథకాల లబ్ధిని వివరిస్తున్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసరావు

- 'గడప గడపకు మన ప్రభుత్వం'లో జెడ్పీ చైర్మన్ శ్రీనివాసరావు

చీపురుపల్లిరూరల్(గరివిడి): ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలో రాష్ట్రంలో అవినీతి రహిత, సంక్షేమ పాలన సాగుతోందని, గడపగడపకూ సంక్షేమ పథకాలు అందుతున్నాయని జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అన్నారు. గరివిడి మండలంలోని శివరాం గ్రామంలో సోమవారం సాయంత్రం 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి ఇంటింటికీ వెళ్లి పథకా లు అందుతున్నాయా లేదా, ఏమైనా సమస్యలున్నాయా అని ప్రజలను ఆరా తీశారు. గ్రామంలోని ఎస్సీ కాలనీ,సచివాలయం సమీపంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయాలని స్థానికులు, ప్రజాప్రతినిధులు కోరారు. ట్రాన్స్‌ఫార్మర్‌లు మంజూరు చేసి ,పనులు త్వరగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను జెడ్పీ చైర్మన్ ఆదేశించారు. అంతకుముందు నిర్వహించిన సభలో ఆయన మాట్లాడుతూ గత నాలుగేళ్లలో వివిధ సంక్షేమ పథకాల రూపంలో గ్రామంలో లబ్ధిదారులకు రూ.12.50 కోట్లను రూపాయి అవినీతి లేకుండా అందించామని చెప్పారు. 'గడప గడపకు ప్రభుత్వం'లో భాగంగా సచివాలయానికి మంజూరయ్యే రూ.20 లక్షలను గ్రామంలో సీసీ రోడ్ల నిర్మాణం, మౌలిక వసతుల కోసం ఖర్చు చేస్తామని తెలిపారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు డ్వాక్రా సంఘాల మహిళల రుణాలను సీఎం జగన్ మూడు విడతల్లో మాఫీ చేశారని గుర్తు చేశారు. గ్రామసచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజలకు ప్రభుత్వసేవలను చేరువ చేశామ ని చెప్పారు. ప్రతినెలా ఒకటో తేదీ ఉదయాన్నే వలంటీర్లు లబ్ధిదారుల తలుపుతట్టి సామాజి పింఛన్లు అందజేస్తున్నారని తెలిపారు. ఇటీవల నిర్వ హించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ప్రజలకు అవసరమైన 11 రకాల ధ్రువపత్రాలను ఉచితంగా ఇళ్ల వద్దకే అందజేశామని గుర్తు చేశారు. రైతు భరోసా కేంద్రాల(ఆర్బీకే) ద్వారా విత్తనాలు, ఎరువులను సకాలంలో గ్రామాల్లో నే రైతులకు అందిస్తున్నా మని, ధాన్యం కొనుగోలు కూడా ఆర్బీకేల్లో చేపడుతున్నామని చెప్పారు. అర్హతే ప్రామాణికంగా పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలను అందిస్తున్నామని, సీఎం జగన్ రూపొం దించి అమలు చేస్తు న్న పథకాలు పేదల ఆర్థికాభి వృద్ధికి దోహదపడుతున్నాయని అన్నారు. ప్రజారోగ్యమే ధ్యేయంగా ప్రభుత్వం 'జగన న్న ఆరోగ్య సురక్ష' కార్యక్రమా నికి శ్రీకారం చుట్టిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా వైద్య సిబ్బంది ఇంటింటికీ వచ్చి ఆరోగ్య పరీక్షలు చేస్తారని, అనంతరం మెడికల్ క్యాంపులు నిర్వహించి వైద్య సేవలందిస్తారని, ప్రజలు సద్వినియోగించుకోవాలని సూచించారు. ప్రజాసంక్షేమం, అభివృద్ధి కోసం నిరంతరం తపిస్తు న్న జగన్‌మోహన్‌రెడ్డిని ప్రజలంతా ఆశీర్వదించాలని కోరారు. ఎంపీడీఓ జి.భాస్కరరావు, తహసీల్దార్ టి.గోవింద్, స్థానిక సర్పంచ్ గవిడి విజయలక్ష్మి, ఎంపీటీసీ గవిడి లక్ష్మి, నాయకులు గవిడి శ్రీధర్,గవిడి దాలినాయుడు, ఎంపీపీ మీసాల విజయలక్ష్మి, ఏఎంసీ మాజీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ మండల నాయకుడు మీసాల విశ్వేశ్వరరావు, మాజీ ఎంపీపీ కొణిశ కృష్ణంనాయుడు, వైస్ ఎంపీపీ గుడివాడ శ్రీరాములనాయుడు, తాటిగూడ పీఏసీఎస్ అధ్యక్షుడు యడ్ల అప్పారావు, జేసీఎస్ ఇన్‌చార్జి పొన్నాడ కుమార్, పలు పంచాయతీల సర్పంచులు,ఎంపీటీసీలు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

ఇంటింటా 'ఆరోగ్య సురక్ష' సర్వే



బొండపల్లి: సర్వేలో భాగంగా గొట్లాంలో వృద్ధురాలికి వైద్యపరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది



వేపాడ: బల్లంకిలో వృద్ధులకు వైద్యపరీక్షలు చేస్తున్న సిబ్బంది



వేపాడ: కుమ్మపల్లి శివారులో వైద్య సేవలందిస్తున్న ఏఎన్ఎం, ఎంఎల్‌హెచ్‌పీలు

బొండపల్లి: మండలంలోని బొండపల్లి, దేవుపల్లి పీహెచ్‌సీల పరిధిలో 'జగనన్న ఆరోగ్య సురక్ష' ఇంటింట సర్వే జోరుగా సాగుతోంది. సర్వేలో భాగంగా ప్రజలకు వైద్య సిబ్బంది వివిధ వైద్యపరీక్షలు చేస్తున్నారు. గొట్లాం గ్రామంలో ఆరోగ్య ఉప కేంద్రం హెల్త్ ఎడ్యుకేటర్ విశేశ్వరరావు ,వైద్య సిబ్బంది, వలంటీర్లు సోమవారం సర్వే చేశారు. అనారోగ్య సమస్యలు ఉన్న వారికి టోకెన్‌లు అందజేసి, త్వరలో గ్రామంలో నిర్వహించనున్న ఆరోగ్య సురక్ష శిబిరానికి హాజరుకావాలని సిబ్బంది సూచించారు.

వేపాడ మండలంలో..

వేపాడ: మండలంలోని కుమ్మపల్లి, పైలకొంపలు, ఆతవ, బానాది,బల్లంకి దబ్బిరాజుపేట తదితర గ్రామాల్లో సోమవారం 'జగనన్న ఆరోగ్య సురక్ష' సర్వేను వైద్య సిబ్బంది నిర్వహించారు. సీహెచ్ఓ ఆంజనేయులు ఆధ్వర్యంలో ప్రజలకు వైద్యపరీక్షలు చేశారు.

జోరుగా రోడ్ల పునరుద్ధరణ



పనులు పూర్తయిన గజపతినగరం ఎన్‌హెచ్-26 నుంచి సీతారామపురం వెళ్లే రోడ్డు



మదుపాడ ఎన్‌హెచ్-26 నుంచి పాతబగ్గాం మీదుగా చేపడుతున్న రోడ్డు పనులు



మరుపల్లి ఎన్‌హెచ్-26 నుంచి పెదకాద వరకు ప్రారంభమైన రోడ్డు పునరుద్ధరణ

గజపతినగరం: మండలంలో దెబ్బతిన్న పలు గ్రామాల రోడ్ల పునరుద్ధరణ పనులు జోరుగా సాగుతున్నాయి. స్థానిక ఎమ్మెల్యే బొత్స అప్పల నరసయ్య చొరవతో రోడ్ల పునరుద్ధరణకు ప్రభుత్వం ఏఎంసీ నుంచి నిధులు మంజూరు చేసింది. మండలంలోని మరుపల్లి ఎన్‌హెచ్-26 నుంచి మరుపల్లి మీదుగా దత్తిరాజేరు మండలం పెదకాద వరకు రూ.95 లక్షలతో రోడ్డు పనులు ప్రారంభమయ్యాయి. మెంటాడ మండలం ఆంధ్ర ఆర్అండ్‌బీ రోడ్డు నుంచి గజపతినగరం మండలం పాతబగ్గాం మీదుగా మదుపాడ ఎన్‌హెచ్-26 వరకు సుమారు 7 కిలోమీటర్ల రోడ్డు పనులను రూ.1.50కోట్లతో చేపడుతున్నారు. గజపతినగరం ఎన్‌హెచ్-26 నుంచి కాలంరాజుపేట, పిడిశీల గ్రామాల మీదుగా సీతారామపురం వరకు రూ.1.90 కోట్లతో రోడ్డు పనులను ఇటీవలే పూర్తి చేశారు. రోడ్ల పునరుద్ధరణ చేపడుతుండంతో ఇన్నాళ్లూ అధ్వాన రోడ్లతో అవస్థలు పడిన ఆయా గ్రామాల ప్రజలు తమ ఇబ్బందులు తొలగాయని సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తులాహ్వానం

గంట్యాడ: స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో ఖాళీగా ఉన్న రెండు అంగన్‌వాడీ ఆయా పోస్టులకు అర్హులు దరఖాస్తు చేసుకోవాలని సీడీపీఓ డోకుల ఉమాభారతి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. బొండపల్లి మండలంలోని దేవుపల్లి అంగన్‌వాడీకేంద్రం-2 (ఓసీ- ఈడబ్ల్యూసీ), గంట్యాడ మండలం బుడతానపల్లి కేంద్రం-3 (ఎస్టీ)లో పోస్టులు ఖాళీగా ఉన్నాయని పేర్కొన్నారు. పదోతరగతి ఉత్తీర్ణులైన, ఆయా గ్రామాలకు చెందిన 21 నుంచి 35 ఏళ్లలోపు వివాహిత మహిళలు అర్హులని తెలిపారు. అక్టోబర్ 5వ తేదీలోగా ప్రాజెక్టు కార్యాలయానికి నేరుగా లేదా పోస్టల్ ద్వారా దరఖాస్తులు అందజేయాలని సూచించారు.

చీపురుపల్లి ప్రాజెక్టు పరిధిలో..

చీపురుపల్లి: ఐసీడీఎస్ చీపురుపల్లి ప్రాజెక్టు పరిధిలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ హెల్పర్ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పీఓ కె.వి.ఎస్.రాజ్యలక్ష్మి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. చీపురుపల్లి మండలంలోని మోదుగులపేట, మెరకముడిదాం మండ లంలోని బోదందొరవలస అంగన్‌వాడీ కేంద్రాల్లో హెల్పర్ పోస్టులు ఖాళీగా ఉన్నట్లు పేర్కొన్నారు. అర్హత కలిగిన ఆయా గ్రామాల మహిళలు అక్టోబర్ 5వ తేదీ సాయంత్రం 5 గంటలలోగా ప్రాజెక్టు కార్యాలయానికి నేరుగా లేదా పోస్టల్ ద్వారా దరఖాస్తులు అందజేయాలని సూచించారు.

గజపతినగరం ప్రాజెక్టు పరిధిలో..

మెంటాడ(గజపతినగరం రూరల్): గజపతినగరం ఐసీడీఎస్ పరిధిలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ పోస్టుల భర్తీకి పీఓ పి.నాగమణి సోమవారం నోటిఫికేషన్ జారీ చేశారు. గజపతినగరం మండలం ఎం.గుమడాంలో ఆయా పోస్టు, మెంటాడ మండలంలోని బానలపాడు గ్రామంలో మినీ అంగన్‌వాడీ కార్యకర్త పోస్టు ఖాళీగా ఉన్నట్లు పేర్కొన్నారు. రూల్ ఆఫ్ రిజర్వేషన్ ప్రకారం అర్హత ఉన్న ఆయా గ్రామాలకు చెందిన వివాహిత మహిళలు అక్టోబర్ 5వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వివరాలకు ఆయా సెక్టార్ల సూపర్‌వైజర్లను సంప్రదించాలని సూచించారు.

పూరిల్లు దగ్ధం

దత్తిరాజేరు: మండలంలోని టి.భూర్జవలసలో సోమవారం రాత్రి సంభవించిన అగ్ని ప్రమాదంలో గవిడి గౌరినాయుడుకు చెందిన పూరిల్లు దగ్ధమైంది. స్థానిక సర్పంచ్ మంత్రి క్రాంతి కుమార్, ఎంపీటీసీ మంత్రి అప్పలనాయుడు తెలిపిన వివరాలు.. వర్షానికి విద్యుత్ సరఫరా లేక పోవడంతో కొవ్వొత్తి వెలిగించారని, అది కమ్మలకు అంటుకొని ఇల్లు కాలిపోయిందని చెప్పారు. రూ.50 వేలకు పైగా ఆస్తి నష్టం వాటిల్లిందని, అగ్నిమాపక, రెవెన్యూ, పోలీస్ సిబ్బందికి సమాచారం అందించామని తెలిపారు.

అభివృద్ధి పనులకు రూ.1.61 కోట్లు

గుర్ల: మండలంలో 54 అభివృద్ధి పనులకు జిల్లా పరిషత్ నిధులు రూ.1.61 కోట్లు మంజూరయ్యాయని జెడ్పీటీసీ శీర అప్పలనాయుడు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. గ్రామాల్లో మౌలిక సదుపాయాలను మెరుగుపరుస్తున్నామని పేర్కొన్నారు. నిధులు మంజూరు చేసిన జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావుకు కృతజ్ఞతలు తెలిపారు.

'స్పందన' అర్జీలకు తక్షణ పరిష్కారం

బొండపల్లి/ దత్తిరాజేరు: 'స్పందన'లో ప్రజలు అందించే అర్జీలకు సంబంధిత శాఖల అధికారులు తక్షణ పరిష్కారం చూపాలని బొండపల్లి, గజపతినగరం మండలాల ఎంపీడీఓలు వై.వి. రాజేంద్రప్రసాద్, సుబ్రహ్మణ్యం సూచించారు. ఆయా మండల పరిషత్ కార్యాలయాల్లో సోమవారం 'స్పందన' కార్యక్రమం ని ర్వహించారు. ప్రజల నుంచి వినతిపత్రాలను స్వీకరించి, సంబంధిత శాఖల అధికారులకు వాటిని అందజేశారు. గ్రామాల్లో ప్రజల సమస్యలను సచివాలయాల స్థాయిలోనే పరిష్కరించాలని సచివాలయ కార్యదర్శులను ఎంపీడీఓలు ఆదేశించారు.

మండల స్థాయి క్విజ్ పోటీలు



చీపురుపల్లిరూరల్(గరివిడి): క్విజ్ పోటీలను పర్యవేక్షిస్తున్న ఎంఈఓ రామారావు



మెరకముడిదాం: విజేతలకు ప్రశంసా పత్రం అందజేస్తున్న ఎంఈఓ-2 ప్రసాద్

చీపురుపల్లిరూరల్(గరివిడి): జిల్లా విద్యాశాఖ ఆదేశాల మేరకు గరివిడి మండల విద్యావనరుల కేంద్రంలో పదోతరగతి విద్యా ర్థులకు మండలస్థాయి రెడ్‌రిబ్బన్ క్లబ్ క్విజ్ పోటీలు సోమవారం నిర్వహించారు. ఈపోటీలకు మండలంలోని పది ఉన్నత పాఠశాలల విద్యార్థులు హాజరయ్యారు. కొండపాలెం పాఠశాల విద్యార్థుల టీమ్ ఏ.లిఖిత,బి.దుర్గాప్రసాద్, జి.ఆమని ప్రథమస్థానంలో నిలిచి జిల్లాస్థాయి పోటీలకు ఎంపికయ్యింది. వెదుళ్లవలస పాఠశాల విద్యార్థులు ద్వితీయ స్థానంలో నిలిచారు. మండల విద్యాశాఖాధికారి పి.రామారావు పాల్గొన్నారు.

మెరకముడిదాంలో..

మెరకముడిదాం: మండలస్థాయి రెడ్‌రిబ్బన్ క్లబ్ క్విజ్ పోటీలను స్థానిక ఉన్నత పాఠశాలలో ఎంఈఓ-2 మండా ప్రసాద్, హెచ్ఎం ఎల్లంనాయుడు ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. తొమ్మిది ఉన్నత పాఠశాలలతో పాటు కేజీబీవీ, మోడల్ స్కూల్ విద్యార్థులు ఈ పోటీలకు హాజరయ్యారు. మెరకముడిదాం ఉన్నత పాఠశాల విద్యార్థులు అరసాడ రోహిత్,లెంక రూపవతి, పదాల హైమ టీమ్ ప్రథమస్థానంలో నిలిచింది. వీరు ఈనెల 27న జిల్లా కేంద్రం విజయనగరంలో నిర్వ హించనున్న జిల్లాస్థాయి పోటీల్లో పాల్గొననున్నారు. విజేతలకు ఎంఈఓ-2 ప్రశంసాపత్రాలు అందజేశారు.

రైతన్నకు 'ఉపాధి' తోడు

- ఉపాధిహామీ ఉద్యానవన విభాగం (ట్రైబల్) రాష్ట్ర అధికారి నారాయణరెడ్డి



పులిగమ్మిలో సాగులో ఉన్న మామిడి మొక్కలను పరిశీలిస్తున్న అధికారుల బృందం

మెరకముడిదాం: ఉద్యానవనాలు సాగుకు ప్రభుత్వం ఉపాధిహామీ పథకం నిధులను కేటాయిస్తోందని పథక ఉద్యానవన విభాగం (ట్రైబల్) రాష్ట్ర అధికారి సి.నారాయణరెడ్డి అన్నారు. పులిగుమ్మి, ఊటపల్లి, నరసయ్యపేట గ్రామాల్లో ఉపాధిహామీ నిధులో చేపట్టిన ఉద్యానవనాలు, ఊటపల్లి నుంచి కొమ్మానివలస గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారికి ఇరువైపులా వేసిన ఎవెన్యూ ప్లాంటేషన్‌ను ఆయన పరిశీలించారు. స్థానిక ఉపాధిహామీ సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఉపాధిహామీ ప్రోత్సాహకాలను రైతులకు చేరువచేయాలని సూచించారు. అనంతరం ఉపాధిహామీ కార్యాలయంలో ఏడు రకాల రిజిస్టర్లను తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఏపీఓ పెదఅప్పలనాయుడు, రాష్ట్ర సీఆర్డీ ఈసీ/ క్యూసీ ఎం.వి.రమణ, జేఈ నరేంద్ర, సాంకేతిక సహాయకుడు సతీష్, ఎల్లయ్య పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ తగదు



శృంగవరపుకోటలో మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

గజపతినగరం/ శృంగవరపుకోట: విశాఖ స్టీల్ ప్లాంట్‌తో పాటు పలు ప్రభుత్వరంగ సంస్థలను కార్పొరేట్ వ్యక్తులకు కట్టబెట్టేందుకు చూస్తున్న కేంద్రంలోని మోదీ ప్రభుత్వాన్ని ప్రజలంతా గద్దెదించేందుకు సిద్ధం కావాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డి.రమాదేవి, కె.లోకనాథం, సీపీఎం జిల్లా ప్రధానకార్యదర్శి తమ్మినేని సీతారాం కోరారు. విశాఖ స్టీల్ ప్లాంట్ పరిరక్షణలో భాగంగా సీపీఎం ఉత్తరాంధ్రలో నిర్వహిస్తున్న ఉక్కురక్షణ బైక్ ర్యాలీ యాత్ర గజపతినగరం, శృంగవరపుకోటకు సోమవారం చేరుకుంది. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ తగద న్నారు. కేంద్రం నిర్ణయానికి వ్యతిరేకంగా పోరాటానికి ప్రజలంతా సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.సీపీఎం విశాఖపట్నం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు స్టీల్ ప్లాంట్ యూనియన్ నాయకుడు కె.ఎం.శ్రీనివాస్, శ్రీకాకుళం జిల్లా నాయకుడు తిరుపతిరావుప్రసాద్, మన్యం జిల్లా నాయకుడు మన్మధరావు, నాయకులు వి.లక్ష్మి,జి.శ్రీనివాస్,రాకోటి రాములు, జగన్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా దీన్ దయాళ్ ఉపాధ్యాయ జయంతి



గజపతినగరం: దీన్‌దయాళ్ ఉపాధ్యాయ చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న బీజేపీ నాయకులు

గజపతినగరం: ఆర్ఎస్ఎస్ మాజీ అధ్యక్షుడు, పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ జయంతిని బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి దేవర ఈశ్వరరావు ఆధ్వర్యంలో మండల కేంద్రంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. దీన్ దయాళ్ ఉపాధ్యాయ చిత్రపటానికి బీజేపీ నేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. విజయనగరం జిల్లా బీజేపీ సీనియర్ నాయకులు ఆచారి, మహిళా కార్యదర్శి మండపాక భారతి, గజపతినగరం,దత్తిరాజేరు మండలాల పార్టీ అధ్యక్షులు ఏడుకొండలు, సింహాచలం పాల్గొన్నారు.

ఎస్.కోటలో..

శృంగవరపుకోట: భారతీయజనతాపార్టీ ఆదేశాల మేరకు పట్టణంలోని ఓ ప్రైవేట్ ఇనిస్టిట్యూట్‌లో పండిట్ దీన్‌దయాల్ జయంతిని బీజేపీ నాయకులు సోమవారం ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర ఓబీసీ మోర్చ కార్యవర్గసభ్యులు ఎలమంచిలి ప్రసాద్,ఓబీసీ మోర్చ మాజీ రాష్ట్ర కార్యదర్శి దొడ్డి సూర్యారావు తదితరులు మాట్లాడుతూ దీన్‌దయాల్ ఉపాధ్యాయ భారతీయ జనసంఘ్ ఉపాధ్యక్షుడిగా, స్వాంతంత్ర్య పోరాటంలో అనేక సేవలు అందించారని అన్నారు.నియోజకవర్గ నాయకులు తాడేళ్ల భూపతి, గణేష్ పాల్గొన్నారు.

సమగ్ర శిక్ష ఉద్యోగులను రెగ్యులర్ చేయాలి

వేపాడ: సమగ్ర శిక్ష ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని విజయవాడలో చేస్తున్న సత్యాగ్రహ దీక్షకు మద్దతుగా స్థానిక ఎంఈఓ కార్యాలయం వద్ద సమగ్ర శిక్ష ఉద్యోగులు సోమవారం మధ్యాహ్నం భోజన విరామ సమయంలో నిరసన తెలిపారు. పీఆర్సీ ప్రకారం ఎంటీఎస్, డీఏ, హెచ్ఆర్ఏ అమలు చేసి వేతనాలు పెంచాలని, ఈపీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని, మెడికల్, చైల్డ్ కేర్ లీవ్‌లు మంజూరు చేయాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ రూ.10 లక్షలు ఇవ్వాలని కోరారు.

1 నుంచి ధర్మప్రచార వారోత్సవాలు

శృంగవరపుకోట: సనాతన హిందూ ధర్మ పరిరక్షణలో భాగంగా దేవదాయశాఖ ఆదేశాల మేరకు అక్టోబర్ 1వ తేదీ నుంచి 7వ తేదీ వరకు ధర్మవరంలోని సన్యాసేశ్వరస్వామి ఆలయంలో వారోత్సవాలు నిర్వహించనున్నట్లు దేవస్థానం ఈఓ ఆదినారాయణ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. అక్టోబర్ 1న ఉదయం 9గంటల నుంచి తమ్మన సిస్టర్స్ వారిచే సంగీత కార్యక్రమం , 2న కె.నిర్మల భాగవతార్ వారిచే రుద్రాక్షమహిమ హరికథ, 3న కె.బాబురావు మాసారు ధార్మికోపన్యాసం, 4న అన్నమాచార్య వాగ్గేయ వరధాయిని, 5న ధర్మవరం వాస్తవ్యులచే రామభజన, 6న మామిడిపల్లి వారి కోలాటం, 7న సామూహిక పారాయణం కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. హిందూ బంధువులు అంతా వారోత్సవాల్లో పాల్గొనాలని కోరారు.

నేటి నుంచి స్కూల్ గేమ్స్ పోటీలు

కొత్తవలస: ఎస్.కోట నియోజకవర్గస్థాయి స్కూల్ గేమ్స్ పోటీలను మంగళవారం నుంచి నిర్వహించనున్నట్లు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ నియోజకవర్గ ఇన్‌చార్జి కె.కృష్ణంరాజు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. కొత్తవలస మండలంలోని బలిఘట్టాం గ్రామ సమీపంలోని ప్రగతి కళాశాల వేదికగా ఈ పోటీలు ఉదయం 10 గంటలకు ప్రారంభమవుతాయని తెలిపారు. 26న బాలులకు, 27న బాలికలకు 9 క్రీడాంశాల్లో ఈ పోటీలను నిర్వహించనున్నట్లు స్పష్టం చేశారు.

ఓపెన్ స్కూల్‌లో ఇంటర్ ప్రవేశాలు

గజపతినగరం: 2023-24 విద్యాసంవత్సరానికి సంబంధించి ఓపెన్ స్కూల్‌లో దూర విద్యావిధానంలో ఇంటర్మీడియట్‌లో ప్రవేశాలకు దరఖాస్తులు స్వీకరిస్తున్నామని స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.బీమేశ్వరరావు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉండి, 10వ తరగతి ఉత్తీర్ణులైన వారు, ఇంటర్ మధ్యలో ఆపేసిన విద్యార్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో ఈనెలాఖరులోగా కళాశాలలో సంప్రదించి అడ్మిషన్లు పొందాలని సూచించారు.

క్లాప్ మిత్రలకు సత్కారం



క్లాప్ మిత్రలను సత్కరిస్తున్న సర్పంచ్ సుధారాణి, వంశీకృష్ణ

చీపురుపల్లి: స్థానిక మేజర్ పంచాయతీ కార్యాలయ ఆవరణలో 'స్వచ్ఛత ఈ సేవ' కార్యక్రమా న్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మేజర్ పంచాయతీలో విధులు నిర్వర్తిస్తున్న క్లాప్ మిత్రలను ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు స్థానిక సర్పంచ్ మంగళగిరి సుధారాణి, ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ తనయుడు వంశీకృష్ణతో కలిసి ఘనంగా సత్కరించారు. సర్పంచ్ మాట్లాడుతూ క్లాప్ మిత్రలు రోజూ నిబద్ధతతో వీధులు, కాలనీల్లో చేపడుతున్న పారిశుద్ధ్య పనుల వల్ల పరిసరాలు పరిశుభ్రంగా ఉంటున్నాయని అన్నారు. స్థానిక నాయకుడు ఇప్పిలి తిరుమల, ఈఓపీఆర్డీ అన్నపూర్ణాదేవి, పంచాయతీ సిబ్బంది రాము, రాజు తదితరులు పాల్గొన్నారు.